అదిగో ఆ అమ్మ దగ్గరకు పంపించెయ్యండి. మా నాన్న కొత్త అమ్మతో సుఖంగా వుంటాడు. ఆ చిన్నారి బోనులో ఏడుస్తున్నాడు.

విజిటర్స్ లాంజ్‌లోంచి ఒక స్త్రీ పరుగు పరుగున వచ్చి ఆ చిన్నారిని హృదయానికి హత్తుకుంది. "ఉదయించే సూర్యుడు తన కాంతితో చీకటిని పారద్రోలినట్టు, ఈ హాలులో అబద్ధాలు వల్లించిన వాళ్ళందర్నీ నోళ్ళు పడిపోయేట్లు నగ్నసత్యాలు చెప్పేవు నాన్న, నాకన్నా "అంటూందామె. ఆ మాతృ హృదయాన్ని అందరూ తదేకంగా చూస్తున్నారు.

"కోర్టు యడ్జర్న్‌డ్ ఫర్ టుడే" అంటూ జడ్జిగారు లోపలకి వెళ్ళిపోయారు.

(నేటి కథ-ఆంధ్రభూమి దినపత్రిక 1-91)

—o—

## అదీ సంగతి

ప్రవీణ, వీణ అనే పేరుతో పత్రికలకు ఉత్తరాలు వ్రాస్తుంటాడు. దాదాపు అన్ని పత్రికలలోనూ అతని ఉత్తరాలు ప్రచురింపబడుతుంటాయి. కొత్త పత్రిక ఏదైనా ప్రారంభించబడిందంటే రెండవ సంచికలో మనవాడి ఉత్తరం ఉండాల్సిందే అంత కన్ విన్సింగ్ ఉత్తరం వ్రాస్తాడు.

ఆ మధ్యన ఒక ప్రముఖ వారపత్రికలో "వీణ" వంద ఉత్తరాలు ప్రచురణ సందర్భంగా అతనితో ఒక ఇంటర్వ్యూ వేశారు.

"ఉత్తరాలు ఎలా రాయాలి?"

"ప్రచురించాలంటే ఉత్తరం ఎలా వుండాలి?"

"మీ మొదటి ఉత్తరం ఏ పత్రికలో ప్రచురించబడింది?"

"అప్పుడు మీ హృదయం ఎలా స్పందించింది?"

"వర్ధమాన ఉత్తరాల రచయితలకు మీ సందేశం ఏమిటి?

ఇత్యాది ప్రశ్నలతో కొనసాగిందా ఇంటర్వ్యూ.

ఇంతా చేస్తే ప్రవీణ బ్రహ్మచారి!

ఉత్తరాల రచనలో తన సహచరులలో అమ్మాయిలు తారసపడినా, ముందుకు వచ్చినా అతను పెళ్ళి చేసుకోలేదు.

కారణం——

అతని ఆశయాల్లో పైకి చెప్పుకునేది "వరకట్న నిర్మూలనే" అయినా, అతనికి పెద్దకట్నం తెచ్చే అమ్మాయిని, ఆ అమ్మాయి ఎలా వున్నా ఫర్వాలేదని, అతని అంతరాత్మ ఘోష.

ఆ విధంగా——

కొంతకాలానికి—

ఏదో అక్షరాలు కూడబల్కుని చదువుకునే సాదాసీదా అందమైన అమ్మాయిని భారీ కట్నంతో పెళ్ళి చేసుకున్నాడు.

నిజానికి ఆ వారంలోనే వరకట్న సమస్యపై అతను వ్రాసిన ఉత్తరానికి "ఉత్తమలేఖ" బహుమతి వచ్చిందనుకోండి.

డబ్బు ఉంటే ఏదో ఒక పత్రికలో దూరి రచయిత అయిపోవాలని ప్రవీణ తాపత్రయం.

ఆ వేళ వాణి కాపురానికి వచ్చింది.

ప్రవీణ ప్రొద్దున్నే లేచి కార్యక్రమాలన్నీ ముగించుకుని ఆఫీసుకు వెళ్ళాడు. "మా నాన్న ఇచ్చిన "యమహా" మీద సాయంత్రం సినిమాకు వెళ్దాం తొందరగా రండి" అంటూ గోముగా సాగనంపింది భార్య.

వాణి ఇల్లంతా సర్దడం మొదలు పెట్టింది. అప్పటి వరకూ బ్రహ్మచారి కొంపకదా, ఎలా వుండాలో అలా వుంది.

ఈ లోగా భర్త డైరీ కనబడింది.

డైరీ చదవకూడదని ఎవరో చెబితే వింది. కాని మనసు ఒప్పుకోలేదు. ఆ డైరీ పేజీలు తిరగేస్తుంటే ఆమె ముఖం ఎర్రగా కందిపోయింది. కళ్ళు ఆకస్మికంగా మబ్బులు కమ్మి నప్పుడు కురిసిన వర్షంలా వర్షించసాగాయి.

ఎక్కడివక్కడ పడేసి సత్యభామ ఫోజులోకి దిగిపోయింది. ఆమెకు దుఃఖం ముంచుకొస్తుంది. వెంటనే ఇంటికి వెళ్ళిపోవాలనుకుంది. కాని ఆయన వచ్చాక విషయాలు తెలుసుకుని వెళ్ళడం మంచిదని ఊరుకుంది.

ప్రవీణ తొందరగా ఇంటికి వచ్చాడు.

వాణి గుమ్మంలో ఎదురు చూస్తుంటుందనుకున్న వీణ లేకపోయే టప్పటికి ప్రవీణ ఉత్సాహం అంతా నీరు కారిపోయింది.

లోపలకు వచ్చి డ్రెస్ విప్పి

"హాయ్, వాట్ డియర్, ఇదేమిటి ప్రొద్దున్న బాగానే వున్నావ్, ఏమయింది?"

ఆదుర్దాగా అడిగాడు.

"నా కేమవుతుంది. ముందు ఈ సంగతి చెప్పండి. ఎవరు వాళ్ళు? మీరు వారానికోసారి ఉత్తరం వ్రాసే ఆ అమ్మాయిలు ఎవరు?

ప్రవీణకు నీళ్ళు కలపకుండా విస్కీ తాగినంత పనైంది. "అమ్మా యిలేమిటి? నీ కేదో మతి పోయింది" అన్నాడు.

"అవును మతిపోయింది కాబట్టే మిమ్మల్ని పెళ్ళిచేసుకున్నాను" అంటూ లేచి వెళ్ళి ఏడుస్తూ అతని డైరీ తెచ్చి చూపించింది.

"ఇవేమిటి చెప్పండి? అంది ఒక పేజీలో—"స్వాతికి ఉత్తరం—

"ప్రభ"కు ఉత్తరం

"జ్యోతి"కి ఉత్తరం

"స్రవంతి"కి ఉత్తరం

"అంజలి"కి ఉత్తరం

ఇలా వున్నాయి ఆడైరీలో

"మీరు రోజుకు ఎంతమంది ప్రియురాళ్ళకు ఉత్తరాలు వ్రాస్తారు సిగ్గులేకపోతే సరి"

"అదా సంగతి అన్నాడు ప్రవీణ.

"నాకు ఏమీ చెప్పనక్కరలేదు. నన్ను వెంటనే మా ఇంటికి పం పించెయ్యండి"

"నేను చెప్పిన విషయం వింటావా. నేను చెప్పింది విన్నాక నచ్చక పోతే వెళ్ళి పోదువుగాని"

అని, అంతవరకూ తను పత్రికలకు వుత్తరాలు వ్రాస్తానని చెప్పర పోవడం తప్పయిందనుకుంటూ తన వుత్తరాలు పడినసదరు పత్రికలన్నీ చూపించి రోజూ ఏ పత్రికకు వుత్తరం వ్రాసానో డైరీలో రాసుకుంటానని చెప్పాడు.

"డియర్ అవన్నీ నేను ఉత్తరాలు వ్రాసిన పత్రికల పేర్లు అంతే కాని అమ్మాయిల పేర్లు కావు అయినా ఈ అప్సరస వుండగా నాకు మరో అమ్మాయి ఎందుకు?

అంటూ వాణిని అక్కున చేర్చుకున్నాడు.

"నన్ను క్షమించరూ" అంటున్న వాణితో "మైడియర్ త్వరలో అఖిలభారత స్థాయిలో ఉత్తరశ్రీ అని బిరుదు ఇవ్వబోతున్నారోయ్" అన్నాడు.

వాణి, ప్రవీణ కౌగిల్లో కరిగి పోతుంది ఇవేమీ ఆమెకు వినిపించ లేదు.

—o—

# దుమ్ము

బుల్‌డోజర్ శబ్దం చేసుకుంటూ ఆర్. టి. సి. బస్ వచ్చి ఆ చిన్న ఊరి బస్ స్టేజీలో ఆగింది.

ఆ రోజు మంచిరోజు, పెళ్ళిళ్ళ సీజన్ కాబట్టి జనం బాగాఉన్నారు. బస్సులో పరిస్థితి అలాగేవుంది. సీట్లన్నీ నిండిపోగా నలుగురయిదుగురు నిలబడి ఉన్నారు. దిగాల్సినవాళ్ళు పదిమంది దిగారు.

"దయచేసి పదిమందిమాత్రమే ఎక్కండి సార్" అన్నాడు కండక్టర్. అంతే అక్కడ ఉన్న జనసమూహం లింగభేదం లేకుండా ఒకరి మీద ఒకరు పడి తోసుకుంటూ బస్సునిండా ఎక్కేసారు. చివర్న రెండు వైపులా కిటికీ ఊసలు పట్టుకుని నలుగురు వ్రేలాడుతున్నారు. వాళ్ళకు కాళ్ళు పెట్టుకోడానికి స్థలంలేదు. పరిస్థితి ఇలా తయారయ్యేప్పటికి అధ్యక్ష పాలన ఉన్నచోట ఎన్నికలు పెట్టమంటే అధ్యక్షుడికి ఎంతకోపంవస్తుందో కండక్టర్‌కి అంతకోపం వచ్చింది.